# నీరందక ఎండుతున్న పంటలు


ఉండవెల్లి శివారులో నీరు లేక ఎండిన ఆర్డీఎస్ కెనాల్

- కంది, మొక్కజొన్న సాగు చేసిన రైతుల ఇబ్బందులు
- సాగునీటి కోసం ఎదురుచూపులు
- చేతులెత్తేసిన ఆర్డీఎస్ అధికారులు


వాడుముఖం పట్టిన మొక్కజొన్న పంట

**ఉండవెల్లి:** యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, కంది పంటలకు సాగునీరు అందక ఎండుముఖం పడుతున్నాయి. ఆర్డీఎస్ కాల్వలను నమ్ముకుని పంటలు వేసిన రైతులకు ఈసారి తిప్పలు తప్పడం లేదు. భూములు కౌలుకు తీసుకున్న రైతులు ఏం చేయాల్లో పాలుపోక దిక్కుతతోచని స్థితిలో ఉన్నారు. మిరప, కంది పంటల నుంచి ఆశించిన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పక్క కౌలు రైతులకు అనూకులమైన పంట మొక్కజొన్న, కంది, మినుముల నుంచైనా తేరుకో వచ్చునుకున్నా సాగునీరు చివరి పంటకు చేరకపోవడం ఒక కారణమైతే.. వారబంధి ఆదిలోనే మొదలు పెట్టడంతో కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రెండో పంటకు ఇబ్బందులు**

ఆర్డీఎస్ నీరు అందుతుందని మొక్కజొన్నను రెండో పంటగా సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. మూడు విడతలుగా కాల్వకు నీటిని విడుదల చేశారు. కానీ చేతికొచ్చిన సమయంలో నీటి ఇబ్బందులు తలెత్తడంతో పంట ఎండుముఖం పట్టాయి. మండలంలో అధికంగా మొక్కజొన్న, కంది, మినుము పంటలను సాగు చేశారు. రెండు సార్లు నీటిని పారించినా.. మూడో తడి అందిద్దామనేలోపే సాగునీటి విడుదల నిలిపివేశారు. అధికారులకు ఫోన్ చేసి అడిగినా నీరు లేదని చెప్తున్నారని వాపోయారు.

**సాగునీరు రాక..**



పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాను. పంటకు రెండు సార్లు తడులు అందించాం. కానీ మూడో తడి కోసం వేచిచూస్తూ ఆగమయ్యాం. చేతికొస్తున్న పంట కళ్ల ముందే ఎండిపోయింది. ఇప్పుడు ఎద్దుల మేతకు మాత్రమే పనికొస్తుంది. దాదాపు రూ.లక్ష పెట్టుబడి పెట్టిన. అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందించలేదు.

– రాముడు, రైతు, ఉండవెల్లి

**ఆగమవుతున్నాం..**

ఆర్డీఎస్ నీటిని నమ్ముకొని మండలంలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. సాగునీరు లేక పంట ఎండిపోతుంటే చూస్తూ ఉండడం తప్పా ఏం చేయలేని నిస్సాహయ స్థితిలో ఉన్నాం. నేను సాగుచేసిన కంది పంట సాగు చేసి.. రెండు తడులు అందించాం. సమీప రైతుల బోర్లతో కాలం వెళ్లదీస్తున్నాం. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో బోర్లపై ఆధారపడలేం. కాల్వకు నీరు అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– శేఖర్ రెడ్డి, ఉండవెల్లి

## 'కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకమే'

**గద్వాల:** ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తాను ఇంకా బీఆర్‌ఎస్‌లో ఉన్నానని చెప్పడం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకమేనని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య, నడిగడ్డ హక్కుల సంఘం నాయకుడు రంజిత్‌కుమార్ దుయ్యబట్టారు. ఈమేరకు వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గతేడాది జూన్ 26న కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం బహిరంగ రహస్యమన్నారు. అయినప్పటికీ ఆయన ఇంకా బీఆర్‌ఎస్‌లో ఉన్నానంటూ ప్రకటన చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే అని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డితో ఆ పార్టీ కండువా కప్పుకుని తర్వాత అది దేవుని కండువా అంటూ అబద్ధాలు చెప్పడం అంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు. ఇంతకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నది మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజల ముందు వచ్చి చెప్పాలని డిమాండ్ చేశారు.

## క్రీడలతో మానసికోల్లాసం



**ధరూరు:** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్దపాడులో గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్‌ఐ శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎస్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందుతుందన్నారు. క్రీడలు ఏవైనా గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు పునాది లాంటిదని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ వెంకట్రాములు, నాయకుడు రాములు, పోలీసులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## కనులపండువగా స్వామివారి రథోత్సవం

**మల్దకల్:** మండలంలోని అమరవాయి, బిజ్వారం గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శివపార్వతుల ఉత్సవమూర్తులను రథంపై ఏర్పాటు చేసి భాజాభజంత్రీలతో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. రథోత్సవం దశమికట్ట వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి దేవాలయానికి చేర్చారు.

**శివపార్వతుల కల్యాణం**

**అయిజ:** మహాశివరాత్రి సందర్భంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వేద పండితులు మంత్రాలు జపిస్తూ శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిపించారు.


గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులకు ఆయల కమిటీ వారు తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వసతి కల్పించారు.


శివపార్వతుల కల్యాణంకు హాజరైన భక్తులు

## నాణ్యమైన భోజనం అందించాలి

**ఉండవెల్లి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు మెనూ తప్పక పాటించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన తోపాటు తహసీల్దార్ ప్రభాకర్ ఆకస్మిక తనఖీ చేశారు. భోజన సామగ్రి, వంటకు ఉపయోగించే వస్తువులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని, కాలం చెల్లిన వాటిని ఉపయోగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈక్రమంలో వేరుశనగ పల్లీలు రంగు మారడాన్ని గుర్తించి వాటిని వెంటనే తిప్పిపంపాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ రామకృష్ణ, తహసీల్దార్ ఆధ్వర్యంలో పాఠశాలల యజమాన్యాలకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆధార్ కార్డు నమోదుపై సూచనలు, సలహాలు అందించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల అపార్ కార్డుల నమోదు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, ప్రధానోపాధ్యాయులు హేమలత పాల్గొన్నారు.

# రహదారులపైనే వారాంతపు సంతలు


అమరచింతలో ప్రధాన రహదారిపై కొనసాగుతున్న సంత


సంత దాటేందుకు ఇబ్బందులు పడుతున్న స్కూల్ బస్సు

- వాహన రాకపోకలకు ఇబ్బందులు
- పూర్తి కాని సమీకృత మార్కెట్ నిర్మాణం

**అమరచింత:** పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వారాంతపు సంతలు కొనసాగుతుండడంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ కేంద్రాల్లో సమీకృత మార్కెట్లను నిర్మించి కూరగాయలు, పూలు, పండ్ల వ్యాపారులతో పాటు చికెన్, మటన్, చేపల విక్రయాలను సైతం వాటిలోనే నిర్వహించాలనే లక్ష్యంతో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ చేసిన నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను నిలిపివేయడంతో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. దీంతో పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో వారాంతపు సంతల నిర్వహణతో పాటు నిత్యం కూరగాయల విక్రయాలు ప్రధాన రహదారులకు ఇరువైపులా కొనసాగుతున్నాయి. దీంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అరికట్టే ప్రయత్నాలను అధికారులు చెపట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారాంతపు సంతల నిర్వహణతో పాటు నిత్యం కూరగాయలు, పండ్ల విక్రయాలను ప్రత్యేక స్థలంలో కొనసాగించాలని వినియోగదారులు కోరుతున్నారు. మార్కెట్‌లో విక్రయాలకు వస్తున్న చిరు వ్యాపారులతో మున్సిపాలిటీ అధికారులు తైబజార్ రూపంలో పన్నులు వసూలు చేస్తున్నా.. వ్యాపారులకు మాత్రం సౌకర్యాలను కల్పించలేకపోతున్నారు.

## క్లుప్తంగా

### కల్లు దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

**గద్వాల క్రైం:** ఎక్సైజ్‌శాఖ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కల్లు దుకాణంపై చర్యలు తీసుకోవాలని జమ్మిచేడ్ గ్రామానికి చెందిన గౌడ కులస్తులు గురువారం గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 16వ తేదీ నాటికి గ్రామంలో ఏర్పాటు చేసిన కల్లు దుకాణానికి అనుమతి గడువు పూర్తయిందన్నారు. అయినప్పటికీ నిర్వాహకుడు లచ్చగౌడుతో పాటు మరి కొంతమంది ఎక్సైజ్‌శాఖ అనుమతి లేకుండానే కల్లును కొన్ని రోజులుగా విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. కల్లు విక్రయాలు చేస్తున్న వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామానికి చెందిన నర్సింహులుగౌడ్, క్రిష్ణయ్యగౌడ్, రవిగౌడ్, రమన్‌గౌడ్ సీఐకు వినతిపత్రం అందజేశారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు



**ధరూరు:** మండలంలోని చింతరరేవులలో గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ శ్రీహరి తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, అనకోని ప్రమాదాలు జరిగితే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు.

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

**మల్దకల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది పర్యటిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఎర్రవల్లి:** గుట్టు చప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై గురువారం ఇటిక్యాల పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొగాకు కంపెనీ వద్ద ప్రియాంక రెస్టారెంట్ సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9,200 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

**శాంతినగర్:** ఆత్మహత్యాయత్నానికి పరోక్షంగా కారణమైన ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్స్ డబ్బులు కట్టని ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రుణం తీసుకున్న నరసింహ ఈఎంఐ కట్టకుండా.. ఫైనాన్స్ కంపెనీ వారినే బెదిరించాడని కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదుచేశారు. ఈఎంఐ కట్టాలని ఒత్తిడి తేవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సి వచ్చిందని నరసింహ కంపెనీ సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదుల మేరకు నరసింహ, ఫైనాన్స్ కంపెనీ వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### మహనీయులకు నివాళి

**అయిజ:** చంద్రశేఖర్‌ఆజాద్, నానాజీ దేశ్‌ముఖ్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమరాన్ని 20వ శతాబ్దిలో సాయుధ పోరాట బాట పట్టించిన తొలితరం విప్లవ యోధుడు చంద్రశేఖర్‌ఆజాద్ అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి, ఆంజేయులు, పెద్ద వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**కేటీదొడ్డి:** మండలంలోని కొండాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇన్‌ఫినిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ సీఈఓ శ్రీకాంత్ రావల్ గురువారం పరీక్ష ప్యాడ్లను అందజేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి గ్రేడ్ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్ చాంద్‌పాషా, మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలి


కూలిన మల్దకల్ ఎస్సీ హాస్టల్ ప్రహరీ

**మల్దకల్:** మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు కూలిన ప్రహరీని వెంటనే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న ఈ వసతి గృహానికి ప్రహరీ కూలిపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులు వసతిగృహంలోకి వెళ్లి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కూలిన ప్రహరీ నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మురుగు కాల్వలను నిర్మించండి


బోరవెల్లిలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

**మానవపాడు:** మండలంలోని బోరవెల్లిలో డ్రెయినేజీల నిర్మాణం సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే మురుగు నిలుస్తుండడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్య తీవ్రతను వివరించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలనిప్రజలు కోరుతున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రకాంత్

**మానవపాడు:** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించొచ్చని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. గురువారం మండలంలోని గోకులపాడులో ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, బాల కార్మికులు, విద్యార్థులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు ఆటపాటలతో వివరించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన


బియ్యం పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

**ధరూరు:** మండలంలోని మన్నాపురం, ధరూరులోని పాఠశాలలను మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. గురువారం ఆయన పాఠశాలకు చేరుకుని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతతో పాటు రుచిగా వండాలని సిబ్బందికి సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలపై ఆరా తీశారు. విద్యార్థుల అపార్ ఐడీలను నమోదు చేయాలని ఆదేశించడంతో పాటు హాజరు రిజిస్టర్లు, స్టోర్ రూంలో వంట సరుకులను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

**అమరచింత:** గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు అదుపు చేసేందుకు అవకాశం ఉంటుందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్‌ఐ సురేష్ కోరారు. మండలంలోని కిష్టంపల్లిలో గురువారం సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తరచూ చోరీలు, అసాంఘిక కార్యక్రమాలు, ప్రమాదాలు, దాడులు పెరుగుతున్నాయని వీటిని అదుపు చేయడంతో పాటు నిందితులను వేగంగా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు తోడ్పడతాయన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసుకుని గ్రామంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుందన్నారు.

## నేటి నుంచి చెరువులో పడవ షికారు


బోట్లకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు, నాయకులు

**ఆత్మకూర్:** పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువులో శుక్రవారం నుంచి పడవ ప్రయాణం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాలతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో రెండు బోట్లను గురువారం రాత్రి ఆత్మకూర్‌కు తెప్పించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు టూరిజంశాఖ అధికారులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు పరిసరాలను పరిశీలించి భారీకేడ్లు, ప్లాట్‌ఫాంను ఇది వరకే ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం నుంచి స్వల్ప రుసుంతో బోట్‌ను నడుపుతామని, జాతర అనంతరం పరిస్థితులను బట్టి బోట్‌ను కొనసాగించాలా లేదా అన్న విషయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఆత్మకూర్ చరిత్రలో మొదటిసారిగా చెరువులో బోట్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు రహ్మతుల్లా, వెంకటనర్సింహారావు, సాయిరాఘవ, మచ్చేందర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నాగేష్, దామోదర్, మహేష్, మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

**జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు**

చెర్ల పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని మార్చి 1, 2తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న జట్ల సభ్యులు పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మొదటి బహుమతి రూ.20 వేలు నగదు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందిస్తామన్నారు. వివరాలకు 97011 63250, 94940 19675, 84998 98925 సంప్రదించాలని కోరారు.

## ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీత


సృజన ఫెస్ట్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, తదితరులు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు అన్నారు. గురువారం ఆ కళాశాలలో సృజన టెక్‌ఫెస్ట్–2025 కార్యక్రమం సాగింది. ఈమేరకు కళాశాలలో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన విద్యార్థులు చేసిన సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. మెకానికల్, ఎలక్ట్రికల్, వంటి విభాగాల్లో పలువురు విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొత్తదనం ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన పలు ఆవిష్కరణలు రాష్ట్రస్థాయిలో సైతం పోటీ పడేలా ఉన్నట్లు తెలిపారు.